క్లుప్తంగా

నిరామయ బీమాపై అవగాహన



బీమాపై అవగాహన కల్పిస్తున్న పీడీ

కాకినాడ రూరల్: వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రంలో నిరామయ ఆరోగ్య బీమా పథకంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భారత ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం సూచనల మేరకు దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్టు కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ కె.నారాయణ రెడ్డి తెలిపారు. ఈ పథకం ప్రకారం రూ.1లక్ష వరకు బీమా కవరేజ్ అందిస్తుందన్నారు.

కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడాలి



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

బాలాజీచెరువు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా పోటీపడాలని లయన్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో మంగళవారం సాలిపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పోటీతత్వం ద్వారా విద్యార్థుల్లో కష్టపడే తత్వం పెరిగి విజయాల సాధనకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మ్యాథ్స్, సైన్స్ అంశాలపై పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేసారు. క్లబ్ ప్రతినిధులు ఏఆర్ మోహన్‌కుమార్, ఎస్.మురళీకృష్ణ, దొడ్డి రామసుబ్రహ్మణ్యం, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం

కరప: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు కూటమి నాయకులు కృషిచేయాలని ఎన్నికల పరిశీలకుడు, శెట్టిబలిజ ఆర్పొరేషన్ చైర్మన్ సీతం రాజ్‌సుధాకర్ కోరారు. మండలం గొర్రిపూడిలో మంగళవారం బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎన్నికల సమాయత్త అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలట్‌లో మొదటి ప్రాధాన్య ఓటు 1వ నంబరు రాసి ఓటు వేసేలా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఏఎస్పీ



కమిషనర్ భావనను కలిసిన ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్

కాకినాడ సిటీ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావనను మంగళవారం ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన మంగళవారం తెల్లవారుజామున నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. 12వ సర్కిల్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వెహికల్ యార్డు ప్రాంతాల్లో కమిషనర్ భావన పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల పరిస్థితిని అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: ఈ నెల 8, 9 ,10, 11 తేదీలలో పిఠాపురంలో నిర్వహించనున్న రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఈనెల 6న నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగే జట్ల ఎంపిక ఈ నెల ఆరో తేదీన రామచంద్రపురంలో ఉదయం 9 గంటల నుంచి బాల బాలికలను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2009 తర్వాత పుట్టిన వారై ఉండాలని, క్రీడాకారులు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ పుట్టిన తేదీ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని తెలిపారు.

ప్రత్యక్ష దైవానికి ప్రణామం



భానుగుడి సూర్యనారాయణ మూర్తి ఆలయంలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



కరపలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



ప్రత్యేక అలంకరణలో భానుగుడి సూర్యనారాయణమూర్తి

- ఘనంగా రథసప్తమి పూజలు
- సూర్యభగవానుడికి వైభవంగా అభిషేకాలు
- దర్శనం కోసం క్యూ కట్టిన ప్రజలు

బోట్‌క్లబ్: రథసప్తమి సందర్భంగా నగరంలో సూర్యనారాయణమూర్తి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భానుగుడి సమీపంలో భానులింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి దర్శనానికి రెండు గంటలకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణ మూర్తికి ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక సంతచెరువు మార్కెట్ సమీపంలో ఉన్న సూర్యనారాయణమూర్తి ఆలయం, స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో, దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో పాటు నగరంలో పలు ఆలయాల ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

ఐడీఏ ఆధ్వర్యంలో..

సూర్య నమస్కారాలతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని ఐడీఏ కార్య దర్శి అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో రథసప్తమి సందర్భంగా మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు పోటీలు నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ శ్రీవల్లి, సభ్యులు నాగేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో ఆరోగ్య పరిరక్షణ

కరప: నిత్యం సూర్యనమస్కారాలు చేయడం వల్ల దీర్ఘ కాలిక రోగాల నుంచి ఉపశమయం పొందవచ్చని గురజనాపల్లి ఆయుష్ డిస్పెన్సరీ ఉద్యోగి, యోగా గురువు పి.లోవరాజు పేర్కొన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు యోగా, ధ్యానం చేయడంవల్ల మానసిక ప్రశాంతత, ఆరోగ్య వృద్ధి కలుగుతుందన్నారు. యోగా గురువు లోవరాజు విద్యార్థులతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు.



సర్పవరం ఆలయంలో పొంగలి తయారు చేస్తున్న భక్తులు

భావనారాయణ స్వామి ఆలయంలో..

కాకినాడ రూరల్: స్థానిక రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామిని భక్తులు దర్శించుకుని పొంగలి తయారు చేసి స్వామివారికి నివేదించారు. అలాగే సర్పవరం జంక్షన్‌లో విశ్వ హిందూ పరిషత్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో సూర్యభగవానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త శిరీష, రెడ్నం రాజా, అడబాల రత్నప్రసాద్, మేడిద శ్రీనివాస్, పార్థ సారధి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, రేడియేషన్ అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ ఓపీ విభాగంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ బాధితులతో పాటు వారి కుటుంబీకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్ర ప్రదీప్ మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ కట్టుబడి ఉందన్నారు. యునైటెడ్ యూనిక్ అనే థీమ్‌ను ప్రకటించి క్యాన్సర్ పట్ల అవగాహన కోసం విశేష కృషి చేస్తోందని కొనియాడారు. జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీతో నిమిత్తం లేకుండా ఉచిత క్యాన్సర్ సేవలు అందుతున్నాయని తెలిపారు. చివరి దశలో ఉన్న బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఆరు పడకల ఐసీయూను ఇటీవల రంగరాయ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ రామ్మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి

బోట్‌క్లబ్: గర్భాశయ కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్సను అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చునని కాకినాడ గైనకాలజిస్ట్ సొసైటీ అధ్యక్షురాలు అనురాగమయి అన్నారు. స్థానిక కొండయ్యపాలెం అర్బన్ హెల్త్‌సెంటర్‌లో మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా గర్భాశయ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి ఎఎల్ సత్యవతి ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా పాపాస్మియర్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు శైలజ, ఉషశ్రీ, వనజ, కరుణ, హిమబిందు, పార్వతి, శ్యామల, రాహిత్య పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

బాలాజీచెరువు: ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ట్రినిటీ హాస్పిటల్‌తో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ రిక్కీ గూటం మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు దానిపై అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వైద్యుల సూచనలతో పాటు తగు నియమాలు పాటించి ధైర్యంగా జీవించాలన్నారు. క్యాన్సర్ లక్షణాలు, దాని ప్రభావం తదితర విషయాలు వివరించారు.

వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం

కాకినాడ రూరల్: ఒకప్పుడు క్యాన్సర్ అంటే చికిత్స లేని జబ్బుగా భావించేవారు. నేడు ఆ పరిస్థితి మారింది. క్యాన్సర్‌ను జయించేందుకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముందుగా లక్షణాలను గుర్తించడం, సకాలంలో వైద్య పరీక్షల నిర్ధారణ, వైద్యం పొందడం ద్వారా ఈ వ్యాధితో కూడిన మరణాలకు చెక్ పెట్టవచ్చు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా యునైటెడ్ బై యూనిక్ థీమ్‌తో రకరకాల క్యాన్సర్ల బారిన పడిన బాధితులకు కాకినాడ మెడికవర్ ఆస్పత్రిలో మంగళవారం వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాధితులు వారు క్యాన్సర్‌ను ఏ విధంగా జయించినదీ వివరించారు. ఈ సందర్భంగా ఆంకాలజిస్ట్ మురళీధర్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు చికిత్స లేదనే భావం సరికాదని, 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళ క్యాన్సర్ బారిన పడకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టరు ప్రషోబ్‌కుమార్, రేడియేషన్ అంకోలజిస్ట్ డాక్టరు పృథ్వీరాజ్, డాక్టరు ప్రదీప్ భాస్కర్ తదితరులు క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. గైనకాలజిస్ట్ లక్ష్మి ప్రవీణ, కస్తూరిబాయ్ చేతుల మీదుగా మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షురాలు అనురాగమయి



క్యాన్సర్ అవగాహనపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. మంగళవారం కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 117 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ నెల నుంచి జనవరి వరకు 13 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 216 స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణి, స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లలోనూ పీసీ, పీఎన్డీటీ చట్టానికి సంబంధించిన బోర్డులను, వాల్‌పోస్టర్లను, ధరల పట్టిక, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 18004253365ను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు, వివిధ శాఖల వైద్యులు కె.రోజాప్రియ, నురునిస్సా బేగం, వన్‌టౌన్ ఎస్సై సీహెచ్ కుమార్, వి.వరలక్ష్మి, కె.సింహాద్రి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



విదేశీ పర్యటన ముగించుకుని విజయవాడ చేరుకున్న వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కాకినాడ మాజీ ఎంపీ, పార్టీ పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాలలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు.



రేపు మధ్వ నవమి వేడుకలు

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6న మధ్వ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధి రాచూరి శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మధ్వాచార్యులు విగ్రహానికి అభిషేకం, పుష్పాలంకరణ జరుగుతాయన్నారు. అనంతరం రామారావుపేట మధ్వసభలో బ్రాహ్మణ సేవ, అన్నదానం జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా మాధ్వాచార్యుని మహిమలపై ప్రవచనం ఉంటుందన్నారు.

ఉత్సాహంగా టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏపీ లాన్ టెన్నిస్ సహకారంతో జిల్లా లాన్‌టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న అండర్-16 ఆల్ ఇండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. బాలుర సింగిల్స్ విభాగంలో కార్తిక్ (ఏపి)పై ధ్రువ్ (తమిళనాడు) 6-0, 6-0, విజేత్ (తెలంగాణ)పై తనిష్ (తెలంగాణ) 6-4,6-1, ప్రతీక్ (ఏపీ)పై ఎస్‌వీ సూర్య (ఏపీ) 6-3, 6-7, 6-3, హర్ష (ఏపీ) పై భవేష్ (తెలంగాణ) 6-0, 6-0 స్కోర్‌తో విజయం సాధించారు. బాలికల విభాగంలో స్వార (ఏపీ) పై జోషిత (ఏపీ) 6-4, 6-0, రెబ్క (తెలంగాణ) పై జానకి (ఏపీ) 6-4, 6-1, లలిత (ఏపీ) పై గౌరిశ్రీ (తెలంగాణ) 6-1, 6-0, తేజశ్రీ (ఏపీ)పై లేఖ్య (ఏపి) 6-1, 6-1 స్కోర్‌తో గెలుపొందారు. మంగళవారం నిర్వహించిన పోటీలను ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్, టోర్ని చీఫ్ రిఫరీ శివకుమార్ పర్యవేక్షించారు.

ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాలు దూరం



హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ నూనె రమేష్, రామారావు

కాకినాడ క్రైం: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు దూరమవుతాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా కాకినాడలోని వార్ఫ్‌రోడ్డులో అంబేడ్కర్ భవన్‌లో ఆటో యూనియన్, బస్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు, ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌లు సంయుక్తంగా హెల్మెట్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి భానుగుడి వరకు ఈ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు నూనె రమేష్, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

8న గొంచాల నుంచి భద్రాచలానికి రథయాత్ర

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామం నుంచి భద్రాచలానికి 14వ రథయాత్ర చేపట్టినట్టు భద్రాద్రి యాత్ర గురుస్వామి వుంగరాల వీరవెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. సీతారామ పరివారం ఉన్న రథంతో కాలి నడకన తొమ్మిది రోజుల పాదయాత్ర చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులు ఆధార్ నకలుతో పాటు రసీదులు, హామీపత్రం అందజేయాలని వివరించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జీ, అధ్యక్షుడు పేర్నిడి వెంకట రమణ, ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి యేలూరి శ్రీనివాసు, కోశాధికారి పేర్నిడి సత్యనారాయణల ఆధ్వర్యంలో యాత్ర జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో దాతల సహకారంతో భోజనాలు, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

భీష్మ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో కొలువైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 8వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ లక్ష్మీనారాయణ సేవా సమాజం ఆధ్వర్యంలో 13వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, భజన సమాజాలతో ఏకాహం నిర్వహించనున్నట్లు తెలిపారు.

భవిత సేవల పరిశీలన



ఫిజియో థెరపీ చికిత్సను పరిశీలిస్తున్న ఎంఈఓ చౌదరి

పెద్దాపురం: భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ సేవలను మంగళవారం ఆయన పరిశీలించి సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియో థెరపీని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ రెడ్డి, ఆనందరావు, పాఠశాల హెచ్ఎం శివజ్యోతి, ఫిజియో థెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నగర వనాల ఏర్పాటుకు చర్యలు



పిఠాపురంలో నగర వనం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- చెందుర్తిలో స్థల పరిశీలన

పిఠాపురం: జిల్లాలో నగర, పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన నగరవనాల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. నగర వనం ఏర్పాటులో భాగంగా ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు. భూ రికార్డులను పరిశీలించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో నగర, పట్టణ ప్రాంతాల్లో జిల్లాలో నగర వనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ప్రభుత్వ భూములు, అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఎకో టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని అధికారులు ఆదేశించారు. అనంతరం ఆయన గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ పరిధిలోని భూములను పరిశీలించారు. భవిష్యత్తులో స్థాపించబోయే పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్.మల్లి బాబు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.